క్లుప్తంగా

బీఎస్పీ బలోపేతానికి కృషి

గోస్పాడు: ఉద్యమాలకు ఊపిరి బహుజన సమాజ్ పార్టీ అని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి వెంకటరమణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన దళిత వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి తమ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం

నంద్యాల(వ్యవసాయం): టీటీడీ రోడ్డులోని జీవీమాల్ వద్ద చలివేంద్రాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉండటంతో పాదచారులకు మంచినీరు, మజ్జిగను ఉచితంగా అందజేయటం అభినందనీయమన్నారు. పండగ సందర్భంగా పానకం వితరణ చేశారు. కౌన్సిలర్ ఖండే శ్యామసుందర్, శ్రీనివాసులు, బింగుమళ్ల శ్యాం పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆళ్లగడ్డ: అగ్నిప్రమాదాలపై నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ వీరారెడ్డి తెలిపారు. అగ్రిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రైవేటు వైద్యశాలల్లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పలు విన్యాసాలను ప్రదర్శించారు. అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగితే ఎలా అదుపు చేయాలి. తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రదర్శన ద్వారా చూపించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

బొమ్మలసత్రం: అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి యోగేశ్వరరెడ్డి తెలిపారు. బొమ్మలసత్రంలోని రామలింగారెడ్డి మహిళా జూనియర్ కళాశాలలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా వ్యవహరించాలి, అదుపులోకి తేవాలనే వాటిని ప్రదర్శన ద్వారా వివరించారు. సిబ్బంది చైతన్యకుమార్‌రెడ్డి, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, శివకుమార్, హుసేన్‌సాహెబ్ ఉన్నారు.

మొబైల్ షాపులో చోరీ

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోనున్న శ్రీనివాస మొబైల్ దుకాణంలో బుధవారం వేకువజామున చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. శ్రీనివాస్ మొబైల్ షాప్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి యథావిధిగా తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం షాపు తెరిచేందుకు రాగా తాళాలు పగులగొట్టబడి ఉండటాన్ని గుర్తించాడు. షాపు తెరిచి లోపలికి వెళ్లి చూస్తే క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.1.50 లక్షల నగదు, ఐఫోన్ చోరీకి గురైందని నిర్ధారించుకున్నాడు. స్థానిక టూటౌన్ పోలీసులకు సమాచారం అందించటంతో వారు ఘటనా స్థలికి చేరుకుని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ రాజారెడ్డి తెలిపారు.

నంద్యాలలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయం



వృద్ధురాలిని ఓటు అడుగుతున్న శిల్పా నాగినిరెడ్డి

నంద్యాల(అర్బన్): ఎన్ని కూటములు వచ్చినా నంద్యాలలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి సతీమణి శిల్పా నాగినిరెడ్డి అన్నారు. పట్టణంలోని 31వ వార్డు ఇస్లాం పేటలో కౌన్సిలర్ అనురాధ, జేసీఎస్ కన్వీనర్ దాల్‌మిల్ అమీర్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు అందించారన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు చిరకాలం పేదలకు అందాలంటే మరోసారి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ముఖ్యమంత్రిగా జగనన్నను, నంద్యాల ఎమ్మెల్యేగా శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డి గెలిపించాలని కోరారు. వార్డు ఇన్‌చార్జ్ భాస్కరరెడ్డి, మాజీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్యగౌడ్, పుల్లమ్మ, వెంగళరెడ్డి, బషీర్, ప్రసాద్ పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



కోటావీధి రామాలయంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న దృశ్యం



కురువనగర్‌లో కల్యాణ తంతు జరిపిస్తున్న దృశ్యం



కోదండ రామాలయంలో తలంబ్రాల కార్యక్రమం నిర్వహిస్తున్న వేదపండితులు



క్రిష్టిపాడులో రాములోరి కల్యాణం



దొర్నిపాడులో చిన్నారుల కోలాటం

- ఘనంగా శ్రీరామనవమి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఆదర్శదంపతులను దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తజనం



ఎస్‌బీఐ కాలనీ రామాలయంలో ప్రసాద వితరణ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి



సంజీవనగర్ రామాలయంలో మాంగళ్యాన్ని భక్తులకు చూపుతున్న పండితులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని అన్ని రామాలయాలు శ్రీరామ నామస్మరణతో మార్మోగాయి. భక్తులు శ్రీరామనవమి పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవలు, పంచామృతాభిషేకాలు, పూలంగిసేవ కార్యక్రమాలు నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని పండితులు వేదమంత్రోచ్చారణల నడుమ వేదయుక్తంగా జరిపించారు. వేడుకను తిలకించడానికి భక్తజనం తరలివచ్చారు. కార్యక్రమాల అనంతరం భక్తులకు ఆలయాల నిర్వాహకులు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. కొన్నిచోట్ల అన్నదానం ఏర్పాటు చేశారు. ఇక సాయంత్ర వేళలో ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం చేపట్టారు.

➡ సంజీవనగర్ రామాలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో వేదపండితులు పవన్‌శర్మ, ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, దీక్షా దారణ, స్వర్ణ యజ్ఞోపవితదారణ, మహాసంకల్పం, మాంగళ్య ధారణ, ముత్యాల తలంబ్రాల తంతు శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం సీతమ్మ వారికి వడిబియ్యం కార్యక్రమం, మూలవిరాట్‌లకు ద్రాక్ష, చెర్రిపండ్లతో అలంకరించారు. ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి ఆలయంలో పూజలు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ఊంజల్‌సేవ నిర్వహించారు. సీత,రామ,లక్ష్మణ ఉత్సవమూర్తులను హనుమంత వాహనంపై ఆశీనులు గావించి గ్రామోత్సవం చేపట్టారు. దేవనగర్‌లోని శ్రీపంచముఖి కాశీవిశ్వేశ్వర శివాలయంలో అర్చకులు శ్రీవాత్సవ ఆధ్వర్యంలో, నందమూరినగర్‌లోని కోదండ రామాలయంలో, కల్పనా సెంటర్‌లోని రామాలయంలో మాజీ కౌన్సిలర్ కత్తిశంకర్ ఆధ్వర్యంలో, ఉప్పరిపేటలోని శ్రీరామభక్త భజన బృందం, పసుపులేటి నారాయణ, సురేష్, ఉప్పరి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో, బైటిపేట రామాజంనేయస్వామి దేవస్థానంలో కోదండ రామాలయంలో, కోటావీధిలోని శ్రీసీతారామలింగేశ్వరస్వామి భవానీ సహిత దేవస్థానంలో కొత్త కృష్ణమూర్తి ఆధ్వర్యంలో, ఎన్‌జీవో కాలనీలోని సాయికరుణాలయంలో, సంగపేట కోదండ రామాలయంలో, ఎస్‌బీఐ కాలనీ రామాలయంలో, బాలాజీ కల్యాణ మండపంలో, టెక్కె అభయాంజనేయస్వామి దేవాలయంలో, నంద్యాల మండలంలోని గ్రామాల్లో సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు.

➡ గోస్పాడులో...

మండల పరిధిలోని గ్రామాల్లో శ్రీరామ నవమి పండుగ వేడుకలను బుధవారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. నెహ్రూనగర్, పార్వతీపురం, జిల్లెల్ల, యాళ్లూరు, తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని వేదపండితులు మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజయ్యారు.



యాళ్లూరులో సీతారాముల ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం

మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు.

➡ దొర్నిపాడు: మండలంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్నీ ఆలయాల్లో సీతారాముల కల్యాణం జరిపించారు. అనంతరం స్వామివారికి పానకం, వడపప్పు, చలిమిడి, మామిడిపండ్లు, చక్కెర పొంగలి, చెరకు, ఇప్పపూలు ప్రసాదంగా సమర్పించారు. అనంతరం స్వామివార్లను గ్రామోత్సవం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

➡ శిరివెళ్ల: మండలంలో శ్రీ రామనవమి పండుగ బుధవారంఘనంగా జరిగింది. వివిధ గ్రామాల్లోని రామాలయాలలో సీతారాముల కల్యాణం చేపట్టారు.

➡ రుద్రవరం: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో బుధవారం శ్రీరామ నవమి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీతారాముల నామస్మరణతో ఆలయాలు మారు మోగాయి. ఉత్సవమూర్తులకు సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపించారు. ఎర్రగుడిదిన్నెలో పుట్లాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు.సింగిల్ విండో డైరెక్టర్ గోపిరెడ్డి పుల్లారెడ్డి,నాయకులు క్రిష్టారెడ్డి,సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.



యర్రగుంట్లలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పండితులు

➡ చాగలమర్రి: మండలంలోని గ్రామాల్లో బుధవారం శ్రీరామనవమి పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చింతలచెరువు గ్రామంలోని సీతారామస్వామి ఆలయంలో రాంనాథ్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని పండితులు కైప నరసింహాశాస్త్రి వేద మంత్రోచ్చారణతో శాస్త్రోక్తంగా జరిపించారు. చాగలమర్రిలోని కోందండరామ స్వామి ఆలయంలో తొమ్మండ్రు వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో పురోహితులు సుబ్రహ్మణ్యశర్మ కల్యాణం నిర్వహించారు. నవత లక్ష్మీ నారాయణ, లక్ష్మీనారాయణరెడ్డి, బాలిరెడ్డి, నర్సిరెడ్డి, చెన్నకేశవరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

➡ ఉయ్యాలవాడ : శ్రీరామ నవమి పండుగను బుధవారంమండలంలో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక కోదండ రామాలయం, సర్వాయిపల్లె గ్రామాల్లో సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా అర్చకులు సురేష్‌శర్మ, మోహనకృష్ణ జరిపించారు. ఉయ్యాలవాడలో స్వామి కళ్యాణానికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు రఘురామ దంపతులు అందజేశారు.



ఉయ్యాలవాడలో భక్తులకు మాంగల్యాన్ని చూపుతున్న అర్చకులు

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



గంగుల ప్రభాకర్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీలో చేరిన టీడీపీ వర్గీయులు

శిరివెళ్ల: మండల కేంద్రానికి టీడీపీ వర్గీయులు 65 మంది బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఐరన్ మర్చంట్ నూరాన్‌పేటకు చెందిన బుగ్గానిపల్లె అహమ్మద్, తెలుగుపేటకు చెందిన చావిడి సుబ్బయ్య, మాజీ వార్డు మెంబర్ ఇస్మాయిల్, బావిడి కాడి చిన్న సంటెన్న, వీర నాగన్న, నాగన్న, గూటాల దస్తగిరి, షేక్ మదార్‌వలి, బుజ్జి, షేక్ మగ్బుల్, సద్దాం, ఓబన్నల కుటుంబాలు పార్టీలో చేరాయి. వీరికి జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ జగనన్న చేసిన మేలును ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాలని, పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు. జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌బేగం, ఎంపీపీ నాయక్ వసీం, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నజీర్, హిస్టరీ అకడామీ స్టేట్ డైరెక్టర్ హఫీజ్, సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్, రిటైర్డ్ ఏంఈఓ మహబూబ్‌బాషా, నాయకులు ముల్లా అన్వర్‌బాషా, దొర్నిపాటి రఫీ, మండల మాజీ ఉపాధ్యక్షుడు కుల్లాయప్ప, దాదిరెడ్డి తిమ్మరాయుడు, ముడిమేల నాగరాజు, ఉల్లి సుబ్బరాయుడు, సముద్రాల సత్యనారాయణశ్రేష్టి, గండికోట పార్థుడు, నాగెళ్ల నాగరాజు, బెస్త సంఘం నాయుడు సుంకి సత్యం పాల్గొన్నారు.

బాబు, కరువు కవలలు



ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వివిధ పార్టీల శ్రేణులు



ఓటు వేయాలని మహిళను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: కరువు, చంద్రబాబు కవల పిల్లలు అని..ఆయన అధికారంలోకొస్తే రాష్ట్రంలో కరువు మళ్లీ తాండవం చేస్తుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి విమర్శించారు. రూరల్ మండలం లింగందిన్నె గ్రామంలో బుధవారం చేపట్టిన ఇంటి ప్రచారానికి అనూహ్య స్పందన లభించింది. ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో ఇదే కూటమి మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమం, అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని గుర్తు చేశారు. 14 సంవత్సరాలు సీఎంగా చేసిన ఆయన పాలనలో ఒక్క పథకమైనా ప్రజలకు మేలు చేసిందా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు తటస్థులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, భూమా కిశోర్ రెడ్డి, నాయకులు దత్తయ్య, లక్ష్మీనారయణరెడ్డి, జయరాముడు, బండి లూకయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారయణ, రామచంద్రారెడ్డి ఉన్నారు.

సమాజాభివృద్ధికి ప్రాధాన్యత

నంద్యాల(సిటీ): సమాజాభివృద్ధికి సమాజ్‌వాదీ పార్టీ పెద్దపీట వేస్తుందని పార్టీ రాయలసీమ జిల్లాల కో–ఆర్డినేటర్ పాండురంగ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల మొదటి జాబితా విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల ఎంపీ అభ్యర్థిగా పాండురంగ యాదవ్, నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా నక్క రాజేష్, శ్రీశైలం అభ్యర్థిగా ఎనకండ్ల మధు, నంద్యాల అభ్యర్థిగా షేక్ ఫరిదాబీ, పాణ్యం అభ్యర్థిగా శివ కృష్ణ యాదవ్‌ను నిర్ణయించినట్లు ప్రకటించారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాలలో ప్రవేశాలకు ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఏప్రిల్ 20 తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఓ యశోద బుధవారం తెలిపారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ బైపీసీలో 40 సీట్లు ఉన్నాయని, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, తల్లిదండ్రులు లేని విద్యార్థినులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. apkgbv. apcfss. in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామన్నారు. మరిన్ని వివరాలను కస్తూర్బా పాఠశాలలో సంప్రదించవచ్చన్నారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

పగిడ్యాల: మండల పరిధిలోని పాత ముచ్చుమర్రిలో ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లిన ఓ కూలీ వడదెబ్బ బారినపడి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బొల్లెద్దుల ఏసేపు(41) ఉపాధి హామీ పథకం కింద పంట కాలువల్లో పూడిక తీత పనులు చేసేందుకు వెళ్లాడు. బుధవారం ఉదయం పని ప్రదేశంలోనే స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన కుటుంబీకులు నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు విడిచాడు. మృతునికి భార్య సుజాత, హేమంత్, సుధీర్, చిన బాబు పిల్లలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి హుటాహుటినా పాత ముచ్చుమర్రికి చేరుకుని మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

కారును ఆపి బెదిరించిన దుండగులు

మహానంది: నంద్యాల నుంచి మహానందివైపు కారులో వెళ్తున్న ప్రయాణికులను తమ్మడపల్లె మలుపు వద్ద గుర్తుతెలియని వ్యక్తులు బెదిరించిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గంగమ్మ గుడి సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద కారును ఆపి బెదిరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పలువురిని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

రేపు బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో శుక్రవారం ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు చెన్నారెడ్డి తెలిపారు. శ్రీరామనవమి సందర్భంగా గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో పాలపళ్ల విభాగంలో పోటీలు జరుగుతాయని చెప్పారు. తొలి 10 స్థానాల్లో నిలిచే వారికి వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు, రూ.4 వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి గల ఎద్దుల యజమానులు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9573442294, 9704383745 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఉద్యమాలతోనే వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ

నంద్యాల(అర్బన్): ఐక్య ఉద్యమాల ద్వారానే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే పునరుద్ధరణ బిల్లును సాధించుకోవచ్చని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న అన్నారు. బుధవారం పాన్నాపురం గ్రామంలో వాల్మీకులతో సమావేశం నిర్వహించారు. సంఘం నాయకులు బోయభారతి, మద్దిలేటి, చిన్నమద్దిలేటి, నాగమద్దిలేటి, సత్యనరసింహులు, సత్తి, నాగయ్య, మురళీ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): రాజకీయ పార్టీలు, నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు పక్కాగా పాటించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ల ప్రక్రియపై పలు రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నామినేషన్లకు వచ్చే అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. 15 నిమిషాల్లోపు అభ్యర్థులు నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, ఈనెల 25 వరకు నామినేషన్లు వేసుకోవచ్చని చెప్పారు. అభ్యర్థులు తెచ్చే డాక్యుమెంట్లు సక్రమంగా ఉండాలన్నారు. సమావేశంలో నంద్యాల తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ తరఫున సాయిరాంరెడ్డి, అనిల్‌అమృతరాజ్, టీడీపీ నుంచి ప్రసాదరెడ్డి, కాంగ్రెస్ రియాజ్, ఎస్‌డీపీఐ, బీజేపీ, ఎంఐఎం, జైభీమ్ తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

హద్దుమీరితే కటకటాలే

మహానంది: ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా హద్దుమీరితే కటకటాలు తప్పవని మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. గాజులపల్లె, గాజులపల్లె ఆర్‌ఎస్ గ్రామాల్లో బుధవారం కేంద్ర బలగాలైన బీఎస్‌ఎఫ్ జవాన్లతో పోలీసు కవాతు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా భయభ్రాంతులకు గురిచేస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

జగనన్నతోనే రాష్ట్రం సుభిక్షం



పెద్దబోధనంలో వృద్ధులను ఓటు అభ్యర్థిస్తున్న గంగుల సారికారెడ్డి

చాగలమర్రి: గత ఐదేళ్లుగా రైతులకు ఆశించిన స్థాయిలో పంటలు పండాయి.. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారు.. ఇందుకు కారణం జగనన్న పాలన. మరో ఐదేళ్ల పాటు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకోవాలని ఎమ్మెల్యే సతీమణి గంగుల సారికా రెడ్డి పిలుపునిచ్చారు.మండలంలోని పెద్దబోధనం, చక్రవర్తులపల్లె, ముత్యాలపాడు తండా గ్రామాల్లో సర్పంచ్‌లు ముడియం శివమ్మ, శంకరమ్మబాయి, శేషురమేష్, చిన్ననాయుడు, నారపురెడ్డితో కలిసి బుధవారం ఇంటింటి ఎన్నికల ప్రచారం చేపట్టారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా గంగుల బిజేంద్రారెడ్డి, నంద్యాల ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. పార్టీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, న్యాయవాది సరిత, ఎంపీపీ వీరభద్రుడు, ఎంపీటీసీలు పత్తినారాయణ, నరసింహులు, సర్పంచ్ గోవిందయ్య, ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్, యువజన విభాగం అధ్యక్షుడు షరీఫ్, వెంకటరమణ, జి.గణేష్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకట్రామిరెడ్డి, వరికూటి సుబ్బారాయుడు, రెహమాన్ పాల్గొన్నారు.